# బంగారుపతకము

శ్రీమతి చమర్తి సీతాదేవిగారు

ఒకఊరిలో ఒకజమీందారుండేవాడు. ఆయన పేరు గంగాధరరాజు. ఆజమీందారు ఏంచేశాడంటే, ఊళ్ళో వుండే కోమట్లని, బ్రాహ్మణుల్ని, క్షత్రియులని పిలిపించి, సభచేశాడు. సభలోనికి ఒక బంగారుపతకం తెచ్చి శారదాశాసనాన్ని తప్పించుకోవడం ఎల్లాగో ఎవరు మంచియుక్తి చెప్తే వారికి ఈపతకం బహుమతిగా ఇస్తానన్నాడు.

సోమనాథం లేచి "చిన్నపిల్లలకే పెళ్ళిళ్లుచేద్దాం, సర్కారువాళ్లు జుల్మానావేస్తే యిస్తాం, ఖయిదులో పెట్టితే వాళ్ల అతిథులు అవుతాం" అన్నాడు.

జమీందారు:—"పేదాబిక్కీ జుల్మానాలు ఇవ్వలేరు. జయిలుఅంటే ఇంకా చాలామందికి భయం పోలేదు. మాలసంపర్కం తప్పదు, మానవతులకు ఏది భంగంవస్తుందో, ఇది పనికిరాదు."

కొడుకులనుగన్న సుబ్బయ్యలేచి:—"సర్కారువాళ్లు ఇప్పట్లో శిక్షలువెయ్యరు. తప్పక జుల్మానాలు వేస్తారు. వరకట్నంతోపాటు జుల్మానాకూడా మాట్లాడుకుందాం. పెళ్లిళ్లు యథాప్రకారం చేద్దాం" అన్నాడు.

జమీందారు:—"ఇది కూతుళ్లుకన్న తల్లిదండ్రులకు కష్టం. జాస్తిమంది యిట్లాచేస్తుంటే సర్కారువాళ్లు ఖయిదు చెయ్యడం ఆరంభిస్తారు. ఇదంతా సరిపడదు."

"ఆడపిల్లలు కడుపులోవుండగానే పెళ్ళిచేస్తే బాగావుంటుంది" అని శ్యామశాస్త్రిల్లు చెప్పాడు.

జమీందారు:—"అట్లాచేస్తే శారదాశాసనం ఏమీచేయదుగాని, కడుపులోఉండేది ఆడపిల్లో మగపిల్లవాడో ఎట్లాతెలుస్తుంది?"

శ్యామశాస్త్రిల్లు:—"జ్యోతిషంవల్ల"

జమీందారు:—"జ్యోతిషం మంచిశాస్త్రమేగాని దాన్ని సరిగా విమర్శించి చెప్పేవారులేరు. జ్యోతిష్కులుచెప్పేవి పూర్తిగా నమ్మడానికి వీలులేదు. ఆడపిల్ల పుడుతుందని కష్టపడి ఖర్చుపెట్టి పెళ్ళిచేస్తే, మగవాడుపుడితే నవ్వులాటగావుంటుంది. ఇదంతా బాగాలేదు.

వీరభద్రరావు లేచి:—"ఇప్పటి లోకపరిస్థితులు చూచేరా? మంచిచెడ్డ లాలోచించకుండా బాల్యవివాహములు చేస్తున్నారు. ఆడపిల్లలు కడుపులో వుండగానే పెళ్ళిచేస్తే బాగావుంటుదన్నారు. మన దేశీయులు అన్యదేశీయులవలె బలవంతులుగా నుండకుండుటకు బాల్యవివాహములే ముఖ్యకారణము. చెట్టువృద్ధికి భూమి కారణముగనుండునట్లు శిశువు యొక్క శరీరారోగ్యనకు తల్లియే ముఖ్యము. తల్లి రక్తబలము తక్కువదైనచో తల్లియందుండు పిండమునకు చాలినంతరక్తము లేక పిండముయొక్క యవయవములు చక్కగ పెరుగవు. పిండమునకు సామర్థ్యము లేక బిడ్డలు బలహీనులుగ జన్మించెదరు. కాన తల్లికి తగు రక్తవృద్ధి శరీరారోగ్యము ఉండవలెను. బాలికలు 18 సంవత్సరములవరకు పెరుగుచుందురని వైద్యులుచెప్పెదరు. బాలికల ప్రథమరజస్వలానంతరము మూడుసంవత్సరములకే శరీరము పౌష్టవముగ నుండును. పురుషునికి 22 సంవత్సరముల పిమ్మటనే శరీరము పటుత్వముగనుండును. పసిప్రాయముననే బాలికలను సంసారమునకు పంపిన దుర్బలలగుదురు. అట్టివారికి జనించుబిడ్డలు చాలకాలము బ్రదుకుట దుర్లభము. గావున దంపతులు యుక్తవయస్కులుగా నుండవలయును. ఇవన్నీ ఆలోచించే శారద మెందలగు

గొప్పవారు బాల్యవివాహములు నిషేధించు శాసనమును అమలులోనికి తెచ్చేరు."

మునుపలియగు రామిశెట్టి లేచి:—"వీరి నవీనతత్వం నాకు బోధపడలేదు. అన్యదేశసంపర్కమువలనను, ఆంగ్లవిద్యాభివృద్ధిచేతను మనదేశమునకు, మతాచారములకు గలిగిన హానివర్ణనాతీతము. వీరభద్రరావు ఆంగ్లవిద్యాధికుడయినందుచే గదా మనమతాచారముల దూషించుచున్నాడు. తోకతెగిన నక్కవలె తాజెడుటయేగాక మనలనందరిని చెడుపదలచినాడు. పాశ్చాత్యనాగరికతావాతావరణము మనదేశమంతటను వ్యాపించి అనేకవ్యాధులకు అనర్థములకు కారణమయింది. మనపెద్దలు బాల్యమునందే వివాహమాడి నిత్యారోగ్యముతో నిగనిగలాడలేదూ?

వీరభద్రరావు:—"మీరట్లే బాల్యవివాహములు చేయండి. నేను సర్కారులో మీపై నిందమోపించి జుల్మానా, శిక్ష వేయించెదను."

వీరభద్రరావు సభనుండిలేచి వెళ్ళిపోయెను.

రామిశెట్టి:—"వాని ప్రసంగముతో మనకు అవసరము లేదు. మన మాలోచింపవలసిన విషయము లాలోచింతాం. కత్తికి భాష్యంకట్టి ఆడపిల్లకు పెళ్లి చేస్తే శారదాశాసనం వర్తించదు. పిల్ల పెరిగినతర్వాత వరుణ్ణి వెతకి గర్భాధానం చెయ్యవచ్చును."

జమీందారు:—"ఇది శాస్త్రసమ్మతమేనా? కత్తికిచేసినపెళ్ళి పెళ్ళిఅనిపించుకుంటుందా?"

అందుకు రామిశెట్టికంటె ముందు గోపాలశాస్త్రులు లేచి:—"అదిసరే. అట్లా చెయ్యవచ్చు. పూర్వం చిత్రాంగికి ఇల్లాచేసి సారంగధరునికి బదులు అతని తండ్రికి కట్టబెట్టారు. ఒకరాచకన్యకను కత్తికి పెండ్లి చేసినట్లూ తర్వాత ఒకపామును మగడుఅని చూపినట్లూ పాముపాటలోకూడా ఉంది. మగవాళ్లకు రెండు పెళ్ళిళ్ళకంటే జాస్తికూడదంటే అరటిచెట్టును మూడో పెళ్ళాంగా చేసుకొని, నాలుగో పెళ్ళికి పిల్లను దేవులాడుతారు. అయితే ఒకపనిజరిగిస్తే శాస్త్రయుక్తం అవుతుంది" అన్నాడు.

జమీందారు:—"అదికూడ చెప్పచూదాం."

గోపాలశాస్త్రులు:—"పసిపిల్లలకు మంత్రాలతో గర్భాధానం చేస్తున్నారా లేదా? ఆలాగే మొదట భాష్యంకట్టినకత్తే తర్వాత ఏర్పడిన వరుడు కావలె. అందుకుగాను పెళ్ళికాలమందు మంత్రపూర్వకంగా కత్తికి రాముడనో, లక్ష్మణుడనో పేరుపెట్టి తర్వాత ఏర్పడేవరునికి ఆపేరును మంత్రపూర్వంగా మార్చి, ఆకత్తిని వాడు సదా వాడుకొనేటట్లు చేస్తే సరిపోతుంది."

రామిశెట్టి:—పెద్దకత్తిని రాత్రిపగలు మోసేదెట్లాగు. చిన్నబాకుఅయితే జంధ్యంలోఅయినా వేసుకోవచ్చు లేకపోతే మొలత్రాటికైనా కట్టుకోవచ్చు. నేను చెప్పేందానికి ఈసవరణ చేసుకొంటాను."

ఈయుక్తి గంగాధరరాజుకు నచ్చింది. సెబాస్ అన్నాడు. అంతకంటె పైయుక్తి యెవరయినా చెప్పగలరాఅని సభవారిని ఆయన అడిగాడు. ఎవరు లేవలేదు. నోరు తెరవలేదు. "పతకం ఎవరికి ఇవ్వవలె" నని జమీందారు అడిగినాడు. రామిశెట్టి తనకురావలె నన్నాడు. గోపాలశాస్త్రులు తనదిఅన్నాడు. గంగాధరరాజు ఒకటో డాచేయించి యుండినందున, రెండో పతకంగూడా తెప్పించి, ఒకటి రామిశెట్టికి రెండవది గోపాలశాస్త్రులకు సభలో బహుమతిగానిచ్చి వారిని మెచ్చుకొన్నాడు. అప్పటినుంచి కత్తికి భాష్యంకట్టి చిన్నపిల్లకు పెళ్ళిళ్ళుచేస్తున్నారు. పిల్లపెద్దది అయ్యేలోపల తగిన వరుణ్ణితెచ్చి శాస్త్రోక్తంగా సంధానం జరిగిస్తారట. ఈపెళ్ళిళ్ళలో శాస్త్రోల్లంఘనలేదు. శాసనోల్లంఘనలేదు. ఇదేవిధంగా మన హిందూమతమునకు ఎన్ని అవాంతరాలువచ్చినా లొంగక తల యెత్తి తిరుగుచున్నది. రాజ్యపరిపాలన చేయుచుండిన హూణులను విధియులను క్షత్రియులుగ గైకొన్నది. పూజలు చేయుచుండిన ద్రావిడులను బ్రాహ్మణులలో చేర్చుకొన్నది. వర్తకముచేయుచుండిన అనేకతెగలు వైశ్యులైరి. బౌద్ధమతసిద్ధాంతములు పురాణమతములో అంతర్భూతములైనవి. భిన్నమతములు భగవద్గీతవలన సమర్థింపబడినవి. అనాదిభారతీయులయు ద్రావిడులయు దేవతలు త్రిమూర్తులలోనో వారి భార్యలలోనో చేరిపోయిరి. యువతీవివాహములుపోయి బాల్యవివాహములు వచ్చినకాలములో ఉపాయములు శాస్త్రాధారములు దొరికెను. ఇదియేనా సనాతన ధర్మము?